సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 5, జూలై, 2024



సోమశిలలో 10.15 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 10.155 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 352 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,670
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,706
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,907
నవర (8 గ్రాములు)	రూ.55,276



ఇదిగో పులి..

జిల్లాలోని మర్రిపాడు వెలుగొండ అటవీ ప్రాంతంలో పులి, చిరుతల సంచారాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు.

8లో

న్యూస్‌రీల్

సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేస్తా

• కలెక్టర్ ఆనంద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలను గురువారం ఆయన స్వీకరించారు. తొలుత మంత్రోచ్చారణల నడుమ వేదపండితుల ఆశీర్వాదాన్ని అందుకున్నారు. ఆయనకు జేసీ సేదు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడారు. గూడూరు సబ్ కలెక్టర్‌గా తనకు మొదటి పోస్టింగ్ లభించిందని, కలెక్టర్‌గా ప్రస్తుతం జిల్లాకు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కృష్ణపట్నం పోర్టు సీఈఓకు అవార్డు



ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావుకు 15వ సౌత్ ఈస్ట్ కార్గో, లాజిస్టిక్స్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. కార్గో, లాజిస్టిక్స్‌పై సౌత్ ఈస్ట్ కాంక్లేవ్ అండ్ అవార్డ్స్ 15వ ఎడిషన్‌ను చెన్నైలో ఎగ్జిమ్ ఇండియా షిప్పింగ్ టైమ్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ క్రమంలో కార్గో, లాజిస్టిక్స్ సెక్టార్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు గానూ ఈ అవార్డును సీఈఓకు ప్రదానం చేశారు. జీజే రావుకు అవార్డు లభించడం సంతోషకరమని పోర్టు ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన్ను పోర్టు ఉద్యోగులు అభినందించారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. జేసీ సేదు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

8న ప్రత్యేక విద్యుత్ అదాలత్



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్నామని ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. విద్యుత్ భవన్‌లోని స్కాడా బిల్డింగ్‌లో కార్యక్రమాన్ని ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార మార్గాన్ని చూపనున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. nationalawardstoteachers. education. gov. inలో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హతలు, ఇతర వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా జైలు వద్ద నుంచి బయల్దేరుతూ అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



అదే ఆదరణ.. అదే అభిమానం..

ప్రజల ప్రేమ, ఆప్యాయతలను పోలీసులు, బ్యారికేడ్లు అడ్డుకోలేకపోయాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారిగా నెల్లూరుకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వచ్చారు. ఆయన రాకతో కనుపర్తిపాడులోని హెలిప్యాడ్ ప్రాంతంతో పాటు జిల్లా జైలు వద్దకు వేలాది మంది జనం పోటెత్తారు. హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేసినా.. తమ అభిమాన నేతతో కరచాలనం చేసేందుకు.. సెల్ఫీలు తీసుకునేందుకు ముందుకు చొచ్చుకొచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సాగిస్తున్న అరాచకాలు, దాడులను జగన్‌కు విన్నవించేందుకు పలువురు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి జగన్ మాట్లాడుతూ.. మీకు అండగా ఉంటాను.. అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. తనను చూసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు.

అభిమాన ఝురి

జననేతపై అదే ఆదరణ.. అదే ఆప్యాయత

- పోటెత్తిన ప్రజలు, నేతలు, కార్యకర్తలు
- గంటల తరబడి నిరీక్షణ
- టీడీపీ సాగిస్తున్న అరాచకాలు, దాడులపై మొరపెట్టుకున్న కేడర్
- జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

నెల్లూరు (పొగతోట): మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు గురువారం రావడంతో అభిమానులు, కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాఖత్ కోసం జననేత వస్తున్నారని ప్రచారం లేకపోయినా వేల సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి ఏర్పాట్లు చేయకపోయినా తమ అభిమాన నేత కోసం గంటల తరబడి నిరీక్షించారు. బ్యారికేడ్లు.. పోలీసులను సైతం లెక్కచేయకుండా ప్రజలు వెళ్లి తమ ప్రియతమ నేతకు ఘన స్వాగతం పలికారు.

ఉదయం నుంచే సందడి

తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరిన జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగారు. ఈ క్రమంలో కనుపర్తిపాడులోని జెడ్పీ హైస్కూల్ వద్దకు ఉదయం 9.30 నుంచే భారీ స్థాయిలో కార్యకర్తలు, అభిమానులు చేరుకున్నారు. వేల సంఖ్యలో తరలివచ్చిన అభిమానులను నియంత్రించడం పోలీసుల వల్ల కాలేదు. హెలిప్యాడ్‌కు ఉదయం 11.30కు చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను చూడగానే ప్రజాభిమానం ఉరకలెత్తింది. బ్యారికేడ్లు, రోపులను తోసుకొని సంక్షేమ సారథి వద్దకు పరుగులు తీశారు. ప్రియతమ నేతను చూసేందుకు, ఆయనతో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. హెలిప్యాడ్ నుంచి హైస్కూల్ ప్రహరీని వాహనం దాటేందుకే 12 నిమిషాల సమయం పట్టిందంటే ఏ స్థాయిలో ప్రజలు వచ్చారో అర్థం చేసుకోవచ్చు. కనుపర్తిపాడులో రోడ్డుకిరువైపులా ప్రజలు, అభిమానులు నిలబడి జననేతకు నీరాజనాలు పలికారు.

తాడేపల్లికి పయనం

జిల్లా పర్యటన ముగించుకున్న అనంతరం కనుపర్తిపాడులోని హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం 1.20కు జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు. అభిమానులు, ప్రజలు, నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ మధ్యాహ్నం 1.30కు తాడేపల్లికి పయనమయ్యారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, అంబటి రాంబాబు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ నేతలు ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆప్కాఫ్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మనుక్రాంత్‌రెడ్డి, సత్యనారాయణ, స్వర్ణా వెంకయ్య, మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ వద్ద అభిమానులతో కరచాలనం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కాకాణితో మొయిళ్ల గౌరి మాటామంతి



జగన్‌కు బొకే అందజేస్తున్న పెద్దిరెడ్డి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

• బాధితులకు భరోసానిచ్చిన జగన్

వెంకటాచలం: టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతూ.. ఆస్తుల ధ్వంసంతో పాటు అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని, వీటిని చూసి ఎవరూ అధైర్యపడొద్దని, ఏ కష్టమొచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తాను అండగా నిలుస్తామని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద గల జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు గురువారం ఆయన వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం ఇస్కపాళెం పంచాయతీ శంకరనగరం గ్రామస్తులు జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. టీడీపీ గెలిచిన రోజు సాయంత్రం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి ఇంటి వద్దకొచ్చి గొడవకు పాల్పడి.. కుటుంబసభ్యులైన రవికుమార్, నాగసునీల్‌రెడ్డి, సుబ్బారెడ్డిపై కర్రలతో దాడి చేశారని వాపోయారు. ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన 18 మందిపై అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. పోలీసులు సైతం టీడీపీ నేతలకు సహకరించి 12 మందిని రిమాండ్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఎవరూ భయపడొద్దని, తాను అండగా ఉంటానని జగన్ భరోసానిచ్చారు. అరాచక టీడీపీ ప్రభుత్వం పతనమై, మన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు న్యాయం జరుగుతుందని ధైర్యం చెప్పారు.



అభిమానులను ఆప్యాయంగా పలకరిస్తూ..

ఆప్యాయంగా పలకరింపు..



తాడేపల్లి పయనమవుతూ..

వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా జైలు వద్దకు జగన్ చేరుకున్నారు. అప్పటికే అక్కడికి పోటెత్తిన అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. జైల్లో పిన్నెల్లితో ములాఖతైన అనంతరం బయట మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు, నేతలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ.. ప్రభుత్వ పెద్దలను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలను విన్న అభిమానులు జై జగన్ అంటూ కేరింతలు కొట్టారు. జిల్లాలో టీడీపీ నేతలు, కార్యకర్తల దాడుల్లో తీవ్రంగా గాయపడి.. ఆస్తులు నష్టపోయిన బాధితులను పరామర్శించారు. టీడీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలను ప్రజలు హర్షించడంలేదని.. త్వరలోనే సరైన బుద్ధి చెప్తారని మనోధైర్యాన్ని కల్పించారు. మీ అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మీ నేతలు ప్రతిక్షణం మీ వెన్నంటే ఉంటారని చెప్పారు. మరోవైపు కనుపర్తిపాడులోని హెలిప్యాడ్ నుంచి జిల్లా జైలు వరకు ఎటు చూసినా జై జగన్ నినాదాలే వినిపించాయి.



జననేత కోసం వేయికళ్లతో..



అభిమానులకు అనిల్ అభివాదం



అశేషంగా హాజరైన జనాలకు నమస్కరిస్తూ..



భారీ జనసందోహం నడుమ కారులో వెళ్తూ..



జాతీయ రహదారిపై భారీ కాన్వాయ్



జననేతను చూసేందుకు పరుగులు తీస్తున్న అభిమానులు

యథేచ్ఛగా భూ కబ్జా

• మట్టి తోలి చదును చేసిన వైనం

మర్రిపాడు: మండలంలో కబ్జాదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని రూ.కోట్ల విలువజేసే భూమిని కబ్జా చేస్తున్నారు. తాజాగా ఆక్రమణదారుల కన్ను మండల పరిధిలోని కృష్ణాపురం సెంటర్‌లో రిజర్వ్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌కు ఎదురుగా ఉన్న స్థలంపై పడింది. వాస్తవానికి సర్వే నంబర్ 658లో ముట్టుకుందు ఆదిలక్ష్మమ్మ పేరుపై 4.2 ఎకరాల భూమి వన్‌బీ అడంగల్‌లో ఉంది. ఇందులో 30 సెంట్ల స్థలంలో బూదవాడకు చెందిన టీడీపీ నేతలు గ్రావెల్‌ను సోమవారం రాత్రి తరలించి చదును చేశారు. ఇలా సుమారు రూ.మూడు కోట్ల విలువజేసే స్థలాన్ని కబ్జా చేశారు. కృష్ణాపురం సెంటర్‌లో రోడ్డు పక్కన సెంటు భూమి ధర రూ.11 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పలుకుతోంది. నిజానికి ఈ స్థల విషయమై కోర్టులో ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ తరుణంలో సంబంధంలేదని వ్యక్తులు భూమిని ఆక్రమించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయమై రెవెన్యూ కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించగా, భూ ఆక్రమణ విషయం తమ దృష్టికి రాగానే సంబంధిత వీఆర్వోను పంపి విచారణ చేయించామని తెలిపారు. ఆక్రమణదారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలను అడ్డుపెట్టుకొని తమ భూమిని ఆక్రమిస్తున్నారని అనుభవ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మున్సిపల్ అధికారుల కర్కశత్వం

- జేసీబీతో దండెత్తి నిర్మాణాల కూల్చివేత
- ఎలాంటి ముందస్తు నోటీసుల్లేకుండానే బరితెగింపు

కావలి: పట్టణంలోని ముసునూరులో మున్సిపల్ అధికారులు కర్కశత్వంగా వ్యవహరించారు. ఎలాంటి ముందస్తు నోటీసుల్లేకుండానే జేసీబీతో దండెత్తి పేదల నివాసాలను కూల్చేసి వారికి నిలువనీడ లేకుండా చేశారు. వాస్తవానికి ముసునూరులోని మందాటి చెరువు పరిసరాల్లో వందల సంఖ్యలో నివాసాలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. ఈ తరుణంలో మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యల్లేకుండానే ఆకస్మికంగా జేసీబీని వెంట తీసుకొచ్చి ఎంపిక చేసిన కొన్ని నిర్మాణాలను కూల్చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా పనిచేసినా, తన ఇంటిని సైతం కూల్చేశారని భక్తవత్సలరెడ్డి వాపోయారు. గేదెల కోసం వసారా వేసుకొని, వాటి మేతకు అవసరమైన గడ్డి తదితరాలను సమకూర్చారు. తన వద్ద పట్టా ఉందని, అయినా కూల్చారని అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసుల్లేకుండా ఆస్తులను ధ్వంసం చేయడం దురదృష్టకరమని చెప్పారు.



నేలమట్టమైన నిర్మాణాలు

ఇదిగో పులి

జిల్లాలో తొలిసారి కదలికలను గుర్తించిన అటవీ శాఖ

- మర్రిపాడు వెలుగొండ అటవీ ప్రాంతాల్లో సంచారం
- ట్రాప్ కెమెరాలకు చిక్కిన పెద్దపులి, చిరుతపులి
- అడవుల్లోకి ఒంటరిగా వెళ్లొద్దని ప్రజలకు అధికారుల హెచ్చరికలు



నీటి మడుగు వద్ద సంచరిస్తున్న పెద్దపులి

ఆత్మకూరు: జిల్లాలో మొదటిసారి పెద్దపులి కదలికలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మర్రిపాడు మండలంలోని వెలుగొండ అడవుల్లో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పెద్దపులి, చిరుతపులి సంచారం కనిపించింది. ఈ విషయం సంచలనం రేపింది. ఈ మేరకు గురువారం వివరాలను అటవీ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. పెంచలకోన అభయారణ్యం పరిధిలోని అడవుల్లో పులులు, చిరుతల సంఖ్య పెరిగిందని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. అటవీ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడంతో జంతువుల్లో పునరుత్పత్తి పెరిగింది. రాపూరు, పెంచలకోన, డక్కిలి, అనంతసాగరం, మర్రిపాడు, ఉదయగిరి, సీతారామపురం, వైఎస్సార్ జిల్లా బద్వేల్ వరకు కలిగిన అభయారణ్యంలో గతంలో చిరుతలు మాత్రమే ఉండేవని అంచనా. ఎగువనున్న శ్రీశైలం అభయారణ్యం నుంచి తాజాగా పెద్దపులి పెన్నానది తీర మార్గంలో ఈ అడవులకు చేరి ఉంటుందని భావిస్తున్నారు. కాగా చిరుతల సంరక్షణను ఆయా మండలాల పరిధిలోని అటవీ శాఖ సిబ్బంది సంరక్షిస్తున్నారు. ఇందుకు గానూ పలు ప్రాంతాల్లో నీటి మడుగుల వద్ద ట్రాప్ కెమెరాలను, ట్రీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల వాటి సంచారాన్ని పాదముద్రల ద్వారా గుర్తించి నమోదు చేశారు.

భయాందోళనలో..

పెద్దపులి, చిరుతపులి సంచారం కనిపించడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలికిపడింది. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా విన్న అటవీ సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. పెద్దపులి, చిరుతపులి విడివిడిగా సంచరిస్తున్నట్లు ట్రాప్ కెమెరాల్లో రికార్డైంది. ఈ కారణంగా సమీప గ్రామాల ప్రజలు తమ జీవాలను మేత కోసం అడవుల్లోకి తోలుకెళ్లవద్దని, కట్టెల కోసం వెళ్లరాదని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పించారు.

ఢీకొంది పెద్దపులి కాదు

కాగా ఇటీవల బద్వేల్ – నెల్లూరు మార్గంలో ముంబై జాతీయ రహదారిపై దట్టమైన అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా రోడ్డు పైకి వచ్చిన పెద్దపులిని తమ కారు ఢీకొందని వెంటనే అది అడవిలోకి పారిపోయిందని కొందరు ప్రయాణికులు చెప్పారు. ఈ దాడిలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పరిశీలన చేసి ఆ దాడికి పెద్దపులి కారణం కాదని తేల్చి చెప్పారు. తమ పరిశీలనలో ఎక్కడా పులి గాయపడినట్లు ఆనవాళ్లు లభించలేదని, అంత దాడి జరిగి ఉంటే కచ్చితంగా జంతువు తీవ్రంగా గాయపడేందుకు ఆస్కారం ఉందని, అలాంటి ఆనవాళ్లు ఎక్కడా లభించలేదన్నారు.

విస్తరించుకుంటూ..

సాధారణంగా పులులు సంచరించే విధానం మిగిలిన జంతువులతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుందని డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. పెంచలకోన అభయారణ్యంలో ఐదు నుంచి ఏడు చిరుతపులులు సంచరిస్తున్న విషయం వాస్తవమేనని, పెద్దపులి జాడ ఇటీవలే తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. సంరక్షణ చర్యలు చేపడితే పులుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. శ్రీశైలం అభయారణ్యంలో పెద్దపులుల సంఖ్య పెరగడంతో అవి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం ఉందన్నారు. ఒక్కో పులి తన సామ్రాజ్యాన్ని 50 నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో విస్తరించుకుంటుందన్నారు. ఆ ప్రాంతంలో మరో పులి సంచరించడాన్ని సహించవన్నారు. పులుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో తాము సంచరించే స్థలాలను పెంచుకోవడంలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయన్నారు. ఈ క్రమంలోనే వెలుగొండ అటవీ ప్రాంతానికి పెద్దపులి వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్దపులుల సంఖ్య పెరిగితే సేఫ్ జోన్ చర్యలు పటిష్టంగా తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు డీఎఫ్‌ఓ వివరించారు. పులులకు ఎలాంటి హాని తలపెట్టినా, వేటగాళ్లు అడవుల్లో సంచరించేందుకు ప్రయత్నించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ సమీప ప్రాంతాల ప్రజలు అడవుల్లోకి వెళ్లవద్దని ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించడం, ముమ్మర ప్రచారం నిర్వహించడం చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

సంరక్షణ చర్యలిలా..

చిరుతపులి, పెద్దపులి సంచరిస్తుంటే ఆ ప్రాంతాలను పులుల అభయారణ్యాలుగా ఫారెస్ట్ అధికారులు ప్రకటిస్తారు. అటవీ ప్రాంతంలో పలుచోట్ల దాహార్తి తీర్చేందుకు నీటితొట్లెలను కట్టిస్తారు. తమ సిబ్బందిచే వారానికోమారు నీళ్లు నింపేలా చర్యలు తీసుకుంటారు.



అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు



వెలుగొండ అడవుల్లో ఇటీవల ట్రాప్ కెమెరాకు చిక్కిన పెద్దపులి

వ్యక్తి బలవన్మరణం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఓ వ్యక్తి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీలో గురువారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఆ కాలనీలో నివాసం ఉంటున్న మలినేని శ్రీధర్ (40)కి వివాహమైంది. భార్య నుంచి విడిపోయిన ఒంటరిగా ఉంటున్నాడు. ఆంధ్రా బ్యాంక్ వీధిలోని ఓ గదిలో ఇంటర్నెట్ కేఫ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి నుంచి అతను బయటకు రాకపోవడంతో బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగులగొట్టారు. శ్రీధర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.

నీటి వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



మొక్క నాటిన కేంద్ర బృందం సభ్యులు, అధికారులు

- జాతీయ ఆహార సంస్థ జాయింట్ సెక్రటరీ పట్నాయక్

వింజమూరు(ఉదయగిరి): జల్‌శక్తి అభియాన్ కింద జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జాతీయ ఆహార సంస్థ జాయింట్ సెక్రటరీ సచిద్ర కుమార్ పట్నాయక్ అన్నారు. కలిగిరి, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో జరుగుతున్న పండ్ల తోటల పెంపకం, నీటికుంటలు, చెరువులు, చెక్‌డ్యాంలు, వాటర్‌షెడ్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపు కోసం కేంద్రం అత్యధికంగా నిధులు ఖర్చు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటి సంరక్షణలో మహిళల భాగస్వామ్యం పెంచాలని తెలిపారు. నీటివనరుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నీటికుంటను, చాకలికొండ చెరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డ్వామా పీడీ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ జల్‌శక్తి అభియాన్‌లో భాగంగా జరుగుతున్న పనులపై అధికారులకు బృందం సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, లోకేష్, డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మి, ఏపీడీలు శంకరనారాయణ, గాయత్రి, మృదుల, ఎంపీడీఓ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా

- ఎంఈఓకు గాయాలు

వరికుంటపాడు: కారు అదుపుతప్పి బోల్తాపడడంతో వరికుంటపాడు ఎంఈఓ షేక్ షావుద్దీన్ స్వల్పంగా గాయపడిన ఘటన గురువారం ప్రకాశం జిల్లా పామూరు మండలం రావిగుంటపాడు టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. షావుద్దీన్ రోజులాగే విధులకు హాజరై స్వగ్రామమైన కనిగిరికి తన సొంత కారులో బయలుదేరారు. టోల్‌ప్లాజా సమీపంలోకి వెళ్లేసరికి కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.312 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సంఖ్య అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లలో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,632 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. లేనివారు 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులు రెండు గంటల్లో దర్శనం చేసుకుంటున్నారు.

పాన్‌కార్డు కోసమంటూ సంతకాలు

- ఖాతాదారుల సొమ్ము కాజేసిన పోస్టుమాస్టర్
- రూ.10 లక్షల నగదుతో పరారీ
- కొద్దిరోజులుగా విధులకు ఎగనామం



పుల్లాయపల్లి పోస్టాఫీస్

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టుమాస్టర్ షేక్ నాయబ్ రసూల్ ఖాతాదారుల సొమ్ము సుమారు రూ.10 లక్షల సొమ్ముతో పరారైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. స్థానికులు, పోస్టాఫీసు అధికారుల కథనం మేరకు.. నాయబ్ రసూల్ ఏడాదిగా పుల్లాయపల్లి బ్రాంచ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల పాన్ కార్డు కోసమంటూ కొంతమంది ఖాతాదారుల వద్ద విత్‌డ్రా ఫారాలపై సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లో ఉన్న నగదును డ్రా చేశాడు. గత నెల 27వ తేదీ నుంచి అతను విధులకు హాజరు కాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు ఉదయగిరి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.సాయికృష్ణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో ఆయన పక్కరోజు గ్రామానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సమక్షంలో పోస్టాఫీసు తాళాలు పగులగొట్టి పరిశీలించారు. అందులో పోస్టాఫీసుకు సంబంధించిన రూ.10 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు గుర్తించారు. రికార్డులు, ఖాతాదారులకు సంబంధించిన పాస్ పుస్తకాలు స్వాధీనం చేసుకుని ఖాతాదారులను విచారించగా సుమారు రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు ప్రాథమికంగా గుర్తించి ఈనెల 2వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము కష్టపడి పనిచేసి పొదుపు చేసుకున్న సొమ్ముతో పోస్టుమాస్టర్ పరారు కావడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ఈ వ్యవహారంపై సాయికృష్ణ స్పందిస్తూ పోస్టాఫీసు పరిధిలో ఉన్న 750 ఖాతాలను పరిశీలించి ఖాతాదారుల సొమ్ము స్వాహా అయినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రికార్డులను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

పాముకాటుకు రైతు మృతి



శీనయ్య మృతదేహం

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని చిలకలమర్రి గ్రామానికి చెందిన డబ్బుకుంట శీనయ్య (45) అనే రైతు పాముకాటుకు బలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. శీనయ్యకు వివాహమైంది. పిల్లలున్నారు. తాను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పొలానికి నీరు పెట్టడానికి బుధవారం రాత్రి వెళ్లాడు. ఈ సమయంలో పాము కాటు వేయడంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అతడిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలిస్తుండగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న సోమశిల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.50
సన్నవి	రూ.30
పండ్లు	రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	132	బ్రాయిలర్ స్కిన్‌లెస్	264
లేయర్ (లైవ్)	115	లేయర్ చికెన్	195
బ్రాయిలర్ చికెన్	238		

యువకుడి దారుణ హత్య

- రామకోటయ్య నగర్‌లో ఘటన
- పాతకక్షలతో ఘాతుకం



నీత్‌రాజ్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో యువకుడిని ప్రత్యర్థులు దారుణంగా హత్య చేసిన ఘటన నెల్లూరు రామకోటయ్య నగర్ పెట్రోల్ బంకు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తూరు సీతమ్మకాలనీలో శేఖర్ నీత్‌రాజ్ (23) నివాసం ఉంటున్నాడు. గత సంవత్సరం జూన్‌లో రామకోటయ్య నగర్‌కు చెందిన సుమంత్, అతని బంధువు చంద్రశేఖర్ అలియాస్ చందు, స్నేహితుడు మనోహర్ టిఫిన్ చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన దేవా పూటుగా మద్యం తాగి వారి వద్దకు వచ్చాడు. డబ్బులివ్వమని అడగ్గా లేవని చెప్పడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అదే నెల 29వ అర్ధరాత్రి తేదీన దేవా తన స్నేహితులైన వెంకటేష్, ఏజాస్, నీత్‌రాజ్ తదితరులతో కలిసి చంద్రశేఖర్, మనోహర్‌పై మారణాయుధాలతో దాడి చేశారు. సుమంత్ ఫిర్యాదు మేరకు అప్పట్లో వేదాయపాళెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇందులో నీత్‌రాజ్ ఐదో నిందితుడిగా చేర్చారు. అప్పటి నుంచి అతడిపై ప్రత్యర్థులు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నీత్‌రాజు రామకోటయ్య నగర్ పెట్రోల్ బంకు సమీపంలో ఉండగా చంద్రశేఖర్ మరికొందరు కలిసి మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. తలకు, ఒంటిపై తీవ్రగాయాలవడంతో నీత్‌రాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా హత్యకు పాల్పడిన చంద్రశేఖర్‌తోపాటు మరికొంత మంది నిందితులను గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రాణం తీసిన అతివేగం

- ఒకరి మృతి



అహ్మద్‌బాషా మృతదేహం



ప్రమాద స్థలంలో వాహనాలు

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ రోడ్డు దాటుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ స్కూటీకి తగలడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నెల్లూరులోని ప్రశాంతినగర్ జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రంగనాయకులపేట రైలు వీధిలో షేక్ అహ్మద్‌బాషా (54), గౌసియా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి నలుగురు కుమారులున్నారు. అహ్మద్‌బాషా అల్యూమినియం కిటికీలు, డోర్‌లు తయారీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఆయన పనివాళ్లను తీసుకుని మూడోమైలుకు వెళ్లాడు. అక్కడ వారికి పని అప్పగించి స్కూటీపై ఇంటికి బయలుదేరాడు. ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో చెన్నై వైపు నుంచి కావలి వైపు వేగంగా వెళ్తున్న లారీ మొదట ఇటుకల ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ స్కూటీని తగలడంతో అహ్మద్‌బాషా రోడ్డుపై పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై కె.గీతారమ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.